క్లుప్తంగా

సిరులతల్లికి పంచామృతాభిషేకం



పంచామృతాభిషేక సేవలో కనకమహాలక్ష్మి అమ్మవారు

దాబాగార్డెన్స్: బురుజుపేటలో వెలసిన కనక మహాలక్ష్మి అమ్మవారి దేవస్థానంలో గురువారం త్రికాల పంచామృతాభిషేకం జరిపారు. ఈ సేవలో పలువురు ఉభయదాతలు పాల్గొన్నారు. ఈ పూజలో పాల్గొనదలిచే భక్తులు రూ.1,000 పూజా రుసుం చెల్లించి పాల్గొనవచ్చు. ఈ ప్రత్యేక పూజను పరోక్ష పద్ధతిలో చేసుకునే ఆసక్తి గల భక్తులు యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా, టౌన్ కొత్తరోడ్డు బ్రాంచ్, అకౌంట్ నంబరు 0608100 11006691, ఐఎఫ్‌ఎస్‌సీ కోడ్ యూబీఐఎన్ 0806081లో చెల్లించవచ్చు. కార్యక్రమంలో ఆలయ ఈవో కె. శోభారాణి, ఏఈవో కె. తిరుమలేశ్వరరావు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

తాగునీటి సమస్య లేకుండా చూడాలి




సీఎస్‌తో జరిగిన వీడియో కాన్ఫరెన్స్‌లో పాల్గొన్న జేసీ మయూర్ అశోక్

మహారాణిపేట: తాగునీటి సమస్య లేకుండా చర్యలు తీసుకోవాలని రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కె.విజయానంద్ జిల్లా కలెక్టర్లను ఆదేశించారు. విజయవాడ ఏపీ సచివాలయంలోని సీఎస్ కాన్ఫరెన్స్ హాల్ నుంచి గురువారం ఉచిత ఇసుక సరఫరా, సోలార్ ప్రాజెక్టులకు భూసేకరణ, సమ్మర్ స్టోరేజీ ట్యాంకుల ఫిల్లింగ్ యాక్షన్ ప్లాన్, తాగునీటి సరఫరా, సానుకూల ప్రజా అవగాహన, ఎంఎస్‌ఎంఈల సర్వే, నియోజకవర్గాల్లో ఎంఎస్‌ఎంఈ పార్కుల ఏర్పాటు, స్వర్ణ ఆంధ్ర–స్వచ్ఛ ఆంధ్ర తదితర అంశాలపై జిల్లా కలెక్టర్లు, ఎస్పీలతో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్ష నిర్వహించారు. విశాఖ కలెక్టర్ కార్యాలయ వీడియో కాన్ఫరెన్స్ హాల్ నుంచి జిల్లా జాయింట్ కలెక్టర్ కె. మయూర్ అశోక్, జిల్లా అధికారులు తదితరులు పాల్గొని జిల్లాలో తాగునీటి పరిస్థితిని వివరించారు.

20న మెగా ఆస్ట్రాలజీ సదస్సు

దాబాగార్డెన్స్: హైదరాబాద్‌కు చెందిన ఎస్‌ఎస్ లైవ్ ఆస్ట్రో సంస్థ ఆధ్వర్యంలో ఈ నెల 20న సింహాచలంలో మెగా ఆస్ట్రాలజీ సదస్సు నిర్వహించనున్నట్టు సంస్థ వ్యవస్థాపకుడు డాక్టర్ నరసింహస్వామి, ఏరియా కో ఆర్డినేటర్ డాక్టర్ అరుణ్ మహేష్, కామేశ్వరరావు తెలిపారు. ఈ మేరకు వీజేఎఫ్ ప్రెస్‌క్లబ్‌లో నిర్వహించిన సమావేశంలో వారు మాట్లాడారు. ఆ రోజు ఉదయం 10 గంటలకు సదస్సు ప్రారంభం కానుందని, మాజీ కేంద్ర మంత్రి పూసపాటి అశోక్ గజపతిరాజు పాల్గొని కార్యక్రమాన్ని ప్రారంభించనున్నారని తెలిపారు. మ్యారేజ్ క్యాపబిలిటీ, జ్యోతిష్య శాస్త్రంలోని యోగాలు, దోషాలు, వాటి పరిహారాలపై ప్రముఖ జ్యోతిష్య పండితులు డాక్టర్ పి. అరుణ్ మహేష్, డాక్టర్ కృష్ణమూర్తి, ఎం. శేషారావు, వి. రమణారావు ప్రసంగించనున్నారని తెలిపారు. సదస్సులో పాల్గొనదలిచే వారు 7281913456 నంబరులో సంప్రదించాలన్నారు.

పవర్ లిఫ్టింగ్ పోటీల్లో సుజాతారావుకు గోల్డ్ మెడల్



సుజాతారావును అభినందిస్తున్న డాక్టర్ శివానంద్

మహారాణిపేట: రాష్ట్ర స్థాయి పవర్ లిఫ్టింగ్ పోటీల్లో కేజీహెచ్ స్టాఫ్ నర్స్ ముసిడిపల్లి సుజాతారావుకు గోల్డ్ మెడల్ లభించింది. ఈ నెల 11 నుంచి 13 వరకు గుడివాడలో జరిగిన రాష్ట్రస్థాయి పవర్ లిఫ్టింగ్ పోటీల స్త్రీల విభాగంలో ప్లస్ 84 కేజీల విభాగంలో ప్రథమ స్థానం సాధించి గోల్డ్ మెడల్ సాధించారు. గురువారం కేజీహెచ్ సూపరింటెండెంట్ డాక్టర్ శివానంద్ సుజాతారావును అభినందించారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ సూపరింటెండెంట్ డాక్టర్ వాసవీలత, నర్సింగ్ సూపరింటెండెంట్ డాక్టర్ పద్మావతి, గ్రేడ్–2 కల్పనా మౌళి, హెడ్ నర్సులు పి.వరలక్ష్మి, నిర్మల జ్యోతి, కమల కుమారి తదితరులు సుజాతారావును అభినందించారు.

- పెరిగిన గ్యాస్ ధరతో పేదల ఇక్కట్లు
- కట్టెలపొయ్యే నయమని ఆవేదన
- పేద, ధనిక వర్గాలను ఒకే గాటన కడితే ఎలా అని నిలదీత



ఇల్లాలి కంట.. గ్యాస్ మంట



జగదాంబ : సామాన్య ప్రజలపై కేంద్ర ప్రభుత్వం మరోసారి భారం మోపింది. వంట గ్యాస్ ధర రూ.50 పెంచింది. ఇప్పటికే పెరిగిన నిత్యావసరాల ధరలతో సతమతమవుతున్న వారిపై పెంచిన గ్యాస్ ధర మరింత భారమైంది. నియోజకవర్గంలో ఇండియన్, హెచ్‌పీ, భారత్ వంటి గ్యాస్ పంపిణీ ఏజెన్సీలు ఉన్నాయి. మొన్నటి వరకూ డొమెస్టిక్ సిలిండర్ ధర రూ.811 ఉండగా ఇప్పుడు దాని ధర రూ.861గా మారింది. జనరల్ కనెక్షన్‌తో పాటు ఉజ్వల్ పథకానికి కూడా పెంచిన ధర వర్తిస్తుంది. ఇప్పటికే ప్రజలు ఉపయోగించే పలు నిత్యావసర వస్తువుల ధరలు పెరిగిపోయి పేద, మధ్య తరగతి ప్రజలు నానా అవస్థలు పడుతున్నారు. దీనికి తోడు గ్యాస్ బండపై ఒకేసారి రూ. 50 పెంపుతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు.

వ్యక్తమవుతున్న నిరసనలు..

గ్యాస్ బండ ధర పెరిగిన వైనాన్ని సీపీఐ, సీపీఎం పార్టీలు తీవ్రంగా ఖండించాయి. పేదలు వాడే వస్తువుల ధరలు పెంచుతున్న ప్రభుత్వాలు ధనికుల జోలికి మాత్రం పోవడం లేదని విమర్శించాయి. పలు ప్రాంతాల్లో దిష్టిబొమ్మలతో నిరసన ప్రదర్శనలు నిర్వహించాయి. కాగా కేంద్ర ప్రభుత్వంతో చెలిమి చేస్తున్న కూటమి ప్రభుత్వం మాత్రం పెరిగిన ధరపై నోరు మెదకపోవడం పట్ల ప్రజలు మండిపడుతున్నారు.

ఉచిత గ్యాస్ మాట దేవుడెరుగు



ఉచిత గ్యాస్ మాట దేవుడెరుగు. ఉన్న గ్యాస్ ధర పెరిగిపోయింది. దీని వల్ల భారం పెరిగిపోయింది. పేద, మధ్య తరగతి ప్రజలు పెరిగిన ధరలతో నానా అగచాట్లు పడుతున్నారు. కూటమి ప్రభుత్వం ప్రజల గురించి ఆలోచించాలి. – పి.లక్ష్మి

ధరలు భయపెడుతున్నాయి



నాకు అసలు గ్యాసే లేదు. కొత్త గ్యాస్ కోసం దరఖాస్తు చేసుకున్నాను. కార్యాలయాల చుట్టూ తిప్పిస్తున్నారు. ఇస్తామని చెప్పడంలేదు.. ఇవ్వమని చెప్పడం లేదు. ఇలా ధరలు పెంచుకుపోతే గ్యాస్ వచ్చినా తీసుకోలేం. ధరలు భయపెడుతున్నాయి. – జి.లక్ష్మి

ప్రజాపాలన ఇదేనా?



ప్రభుత్వం ఏర్పడిన తర్వాత ప్రశ్నిద్దాం.. మీతో కలిసి పోరాడతాను అన్న జనసేన అధినేత పవన్‌కళ్యాణ్ ఇప్పుడేం చేస్తున్నారు. మధ్య తరగతి ప్రజలపై పెనుభారం మోపుతున్నారు. ఇదేనా మీరు ప్రశ్నించడం? – ధనలక్ష్మి

మహిళలు తిరగబడే రోజులు వస్తాయి



ప్రభుత్వంపై మహిళలు తిరగబడే రోజులు వస్తాయి. ఎన్నికల ముందు ఎన్నో మాటలు చెప్పిన నాయకులు ఈ రోజు ఎక్కడా కానరావడం లేదు. గ్యాస్ ధరలు పెంచుకుపోతుంటే అడిగే నాథుడే లేకపోతున్నాడు. – హేమవతి

కట్టెల పొయ్యే నయం



జగనన్న ప్రభుత్వంపేదలను ఆదుకుంటే.. కూటమి ప్రభుత్వం భారం మోపుతోంది. గ్యాస్ కంటే కట్టెల పొయ్యే నయం అనే పరిస్థితికి ప్రజలను తీసుకొస్తున్నారు. – సత్యవతి

ఇంతింత ధరలు ఎలా తట్టుకోగలం?



మురికి వాడ ప్రజలంటే ఏ పూటకు ఆ పూటే తెచ్చుకుని బతికే వాళ్లం. మాలాంటి వారిపై కూడా ధరల భారం వేస్తే ఎలా తట్టుకుంటాం? కూటమి ప్రభుత్వంలో పేద, ధనిక అనే భావన లేదు. అందరినీ ఒకేలా చూస్తూ గ్యాస్ ధర పెంచేస్తే ఎలా? – నారాయణమ్మ

ఏఎంసీలో ముగిసిన అనాస్కెచ్ ఉత్సవాలు



జ్యోతి వెలిగించి కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్న డాక్టర్ శివానంద్

మహారాణిపేట: ఆంధ్ర వైద్య కళాశాల అనాటమీ డిపార్టుమెంటులో రెండు రోజుల నుంచి జరుగుతున్న అనాస్కెచ్–2.0 ఉత్సవాలు నేటితో ముగిశాయి. కాలేజీ అనాటమీ డిపార్టుమెంటులో ఎంబీబీఎస్ మొదటి సంవత్సరం విద్యార్థులు రెండు రోజులుగా పలు కార్యక్రమాలను నిర్వహించారు. అనాటమీ విభాగాధిపతి డాక్టర్ రవీంద్ర కిషోర్ ఆధ్వర్యంలో మొదటి సంవత్సరం ఎంబీబీఎస్ విద్యార్థులు పలు సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు. గురువారం కేజీహెచ్ సూపరింటెండెంట్ డాక్టర్ పి.శివానంద్ జ్యోతి వెలిగించి కార్యక్రమాన్ని ప్రారంభించారు. ప్రదర్శనలో శరీర భాగాలను పొందుపరిచారు. బాడీ పెయింట్స్, మెడల్స్, రంగవల్లులు ప్రదర్శించారు. ఈ కార్యక్రమంలో ఆంధ్రా మెడికల్ కాలేజీ ప్రిన్సిపాల్ డాక్టర్ సంధ్యాదేవి, వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ కృష్ణవేణి, ప్రొఫెసర్ డాక్టర్ రాధిక, ఫిజియాలజీ విభాగాధిపతి డాక్టర్ గీతాంజలి, బయోకెమిస్ట్రీ హెచ్‌వోడీ డాక్టర్ భవానీ, ఫిజియాలజీ డాక్టర్ ఉషారాణి, విజయనగరం ప్రభుత్వ మెడికల్ కాలేజీ హెచ్‌వోడీ డాక్టర్ వాసంతి, అసిస్టెంట్ ప్రొఫెసర్ డాక్టర్ సురభి, డాక్టర్ హేమ రాధిక, అధ్యాపకులు, టీచింగ్ ఫ్యాకల్టీ, నాన్ టీచింగ్ సిబ్బంది, పీజీ విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

అగ్నిప్రమాదాలపై విద్యార్థులకు అవగాహన



మంటలను ఎలా అదుపు చేయాలో మాక్ డ్రిల్ ద్వారా వివరిస్తున్న అగ్నిమాపక సిబ్బంది



అగ్ని ప్రమాదాలపై విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న ఫైర్ సిబ్బంది

అల్లిపురం: అగ్నిమాపక వారోత్సవాల్లో భాగంగా గురువారం రెడ్‌నమ్‌గార్డెన్స్‌లో గల చైతన్య కాలేజీ విద్యార్థులకు జిల్లా అగ్నిమాపకశాఖ సిబ్బంది అవగాహన కల్పించారు. అగ్నిప్రమాదాలు సంభవించినప్పుడు తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారు. ముందస్తు జాగ్రత్తలు తీసుకోవడం వల్ల ప్రమాదాలను నివారించవచ్చని తెలిపారు. ఈ సందర్భంగా ప్రయోగాత్మకంగా అగ్నిప్రమాదాలు చోటు చేసుకున్నప్పుడు తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారు. ఈ కార్యక్రమంలో జిల్లా సహాయ అగ్నిమాపక అధికారి పి.సింహాచలం, సిబ్బంది పాల్గొన్నారు.

జీవీఎంసీ కార్మికుల సమస్యలపై ధర్నా



ఆశీలమెట్ట జోన్–3 కార్యాలయం వద్ద ధర్నా చేస్తున్న సీఐటీయూ నాయకులు

సీతమ్మధార: జీవీఎంసీలో 30 ఏళ్లు పనిచేసి రిటైరైన కాంట్రాక్ట్ కార్మికులు(ఆప్కాస్), అకాల మరణం పొందిన కార్మికులు, అనారోగ్యం పాలై వైద్యం పొందుతున్న కార్మికుల కుటుంబాల బిడ్డలకు తక్షణం ఉపాధి కల్పించాలని జీవీఎంసీ కాంట్రాక్ట్ వర్కర్స్ యూనియన్(సీఐటీయూ) ఆర్గనైజింగ్ సెక్రటరీ వి.కృష్ణారావు డిమాండ్ చేశారు. యూనియన్ ఆధ్వర్యంలో గురువారం ఆశీలమెట్ట జోన్–3 కార్యాలయం వద్ద ధర్నా చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 60 ఏళ్లు దాటినవారు, చనిపోయినవారు, అనారోగ్యం పాలైన కార్మికుల పోస్టులు ఖాళీగా ఉన్నప్పటికీ వాటిని భర్తీచేయడం లేదన్నారు. 2023 ఆగస్టులో నాటి కమిషనర్ రాతపూర్వకంగా మినిట్స్ రూపంలో కార్మికుల బిడ్డలకు ఉపాధి కల్పిస్తామని చేసిన ఒప్పందాన్ని తుంగలో తొక్కారన్నారు. కార్మికులకు పనిముట్లు, సేఫ్టీ పరికరాలు ఇవ్వకుండా వారి డబ్బులతోనే చీపుర్లు వంటివి కొనిపించడం జీవీఎంసీకే అవమానకరమన్నారు. గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం ఆప్కాస్ పెట్టి అందులో మున్సిపల్ కార్మికులను చేర్పించిందన్నారు. నేడు కూటమి ప్రభుత్వం ఆప్కాస్‌ను రద్దుచేసి కాంట్రాక్టర్ల వ్యవస్థను తెస్తామని చెప్పడం దుర్మార్గమన్నారు. తక్షణమే మున్సిపల్ కార్మికులను పర్మినెంట్ చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో యూనియన్ నాయకులు కె.కుమారి, పి.వెంకటరావు, ఆర్.శ్రీనివాస్, ఇ.ఆదినారాయణ, కొండమ్మ, విజయ, రాజు, లక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ పాఠశాలల్లో ప్రవేశాలు పెరగాలి

విశాఖ విద్య: ప్రభుత్వ పాఠశాలల బలోపేతానికి యూటీఎఫ్ చేస్తున్న కృషి అభినందనీయమని జిల్లా విద్యా శాఖాధికారి ప్రేమ్ కుమార్ అన్నారు. ప్రభుత్వ స్కూళ్లలో అడ్మిషన్లు పెరిగేలా యూటీఎఫ్ జిల్లా కమిటీ ఆధ్వర్యంలో ముద్రించిన పోస్టర్లను గురువారం తన చాంబర్‌లో యూటీఎఫ్ నాయకులతో కలిసి ఆయన ఆవిష్కరించారు. ప్రభుత్వ పాఠశాలల్లో పిల్లలను చేర్పించి, వారి బంగారు భవితకు బాటలు వేయాలని పిలుపునిచ్చారు. ప్రభుత్వ స్కూళ్లు బలోపేతమైతేనే అందరికీ మేలు జరుగుతుందన్నారు. యూటీఎఫ్ జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు దాసరి నాగేశ్వరరావు, టి.ఆర్.అంబేడ్కర్, కోశాధికారి కె.రాంబాబు, కార్యదర్శులు రియాజ్ అహ్మద్, టి.జగన్ తదితరులు పాల్గొన్నారు.

పొగ రహిత పురోగతికి కృషి

దాబాగార్డెన్స్: పొగ రహిత పురోగతికి ఫిలిప్ మోరీస్ ఇంటర్నేషనల్ సంస్థ కృషి చేస్తోందని ఆ సంస్థ చీఫ్ ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్ జాసెక్ ఓల్జాక్ ఒక ప్రకటనలో పేర్కొన్నారు. పొగ రహిత ప్రత్యామ్నాయాలతో వీలైనంత త్వరగా సిగరెట్ల వాడుక లేకుండా చేయాలన్నదే సంస్థ ముఖ్యోద్దేశమని తెలిపారు. ఇటీవల నిర్వహించిన సంస్థ 10వ వార్షికోత్సవంలో ప్రమాదాల తగ్గింపుతో పాటు కార్యాచరణ, సామర్థ్యం, ఆవిష్కరణ, ఉద్దేశ పూర్వక ప్రభావం కలిగి ఉన్న ఐదు అంశాలపై చర్చించి నివేదిక అందజేసినట్లు తెలిపారు.

మనమిత్ర యాప్‌పై అవగాహన



మనమిత్ర యాప్‌పై అవగాహన కల్పిస్తున్న సచివాలయ కార్యదర్శులు

అల్లిపురం: జోన్–4 జోనల్ కమిషనర్ మల్లయ్యనాయుడు ఆదేశాల మేరకు 33వ వార్డు గౌరీవీధి సచివాలయం ఆధ్వర్యంలో మనమిత్ర యాప్‌పై అవగాహన కల్పించారు. ఈ మేరకు సచివాలయ సిబ్బంది, కార్యదర్శులు జయచంద్ర యాదవ్, పీవీ కిరణ్ కుమార్ యాదవ్ మొబైల్ ఫోన్లలో 9552300009 వాట్సాప్ నంబర్ సేవ్ చేసుకోవాలని, తద్వారా హాయ్ అనే మెసేజ్ పంపటం ద్వారా సేవలు పొందవచ్చని వివరించారు. శక్తి యాప్ ద్వారా మహిళలకు రక్షణ లభిస్తుందన్నారు.

సంపత్ వినాయగర్ హుండీ ఆదాయం రూ.16.45 లక్షలు

సీతమ్మధార : ఆశీలమెట్టలో గల సంపత్ వినాయగర్ ఆలయంలో హుండీ ఆదాయాన్ని గురువారం లెక్కించారు. 21 రోజులకు గాను రూ.16.45 లక్షలు నగదు, బంగారం 2.977 మిల్లీ గ్రాములు, వెండి 0.098 మిల్లీ గ్రాములు పలు దేశాలకు చెందిన డాలర్స్ ఒమన్ రియల్ 40, మలేసియా రింగ్గిట్ 1, కతర్ రియల్ 1, ఒక చెక్కు లభించాయని ఆలయ కార్యనిర్వహణాధికారిణి కె.శిరీష తెలిపారు. శ్రీ వెంకటేశ్వర సేవా సంఘం సభ్యులు, దేవస్థానం సిబ్బంది హుండీ ఆదాయాన్ని లెక్కించారు.

మే నాటికి ఆర్‌వోబీ పనులు పూర్తి చేయాలి



ఆర్‌వోబీ పనులు పరిశీలిస్తున్న వీఎంఆర్‌డీఏ కమిషనర్ విశ్వనాథన్

విశాఖ సిటీ : రైల్ ఓవర్ బ్రిడ్జి(ఆర్‌వోబీ) పనులు ఎట్టి పరిస్థితుల్లోను మే నెలాఖరు నాటికి పూర్తి చేసి బ్రిడ్జిను ఉపయోగంలోకి తీసుకురావాలని వీఎంఆర్‌డీఏ కమిషనర్ కె.ఎస్.విశ్వనాథన్ ఇంజనీరింగ్ అధికారులను ఆదేశించారు. క్షేత్ర స్థాయి పర్యటనలో భాగంగా ఆయన గురువారం పలు ప్రాజెక్టులు, అభివృద్ధి పనులను పరిశీలించారు. ముందుగా సెంట్రల్ నర్సరీలో సుమారు రూ.93 లక్షల వ్యయంతో చేపడుతున్న అభివృద్ధి పనులను పరిశీలించారు. పనులను వేగవంతంగా పూర్తి చేయాలని కాంట్రాక్టర్‌ను ఆదేశించారు. అనంతరం ఎన్ఏడీ ఫ్లై ఓవర్ వద్ద నిర్మిస్తున్న ఆర్‌వోబీ పనులను ఇంజినీర్లు, గుత్తేదారు ప్రతినిధిని అడిగి తెలుసుకున్నారు. ఈ పర్యటనలో ప్రధాన ఇంజనీర్ వినయ్ కుమార్, పర్యవేక్షక ఇంజనీర్ బలరామరాజు, కార్య నిర్వాహక ఇంజనీర్ మధుసూదనరావు, డీఎఫ్‌వో సుజాతా శివానీ, సహాయక ఇంజనీర్ శ్రీనివాసరెడ్డి, గుత్తేదారు సంస్థ ప్రతినిధులు పాల్గొన్నారు.

లేబర్ కోడ్స్ రద్దు చేయాలి

- మే 20 నాటి అఖిల భారత సమ్మె విజయవంతం చేయండి
- అఖిలపక్ష కార్మిక సంఘాల పిలుపు



నినదిస్తున్న అఖిలపక్ష కార్మిక సంఘాల నాయకులు

దాబాగార్డెన్స్: కేంద్రంలోని మోదీ ప్రభుత్వం తీసుకొచ్చిన 4 లేబర్ కోడ్స్‌ను తక్షణమే రద్దు చేయాలని కోరుతూ మే 20న జాతీయ సమ్మెకు అఖిలపక్ష కార్మిక సంఘాలు పిలుపునిచ్చాయి. సమ్మె విజయవంతం చేయాలని కోరుతూ గురువారం నగరంలోని జగదాంబ జంక్షన్ సమీపాన గల సిటు కార్యాలయంలో అఖిలపక్ష కార్మిక సంఘాలు సమావేశం నిర్వహించాయి. ఈ సందర్భంగా సిటు నాయకుడు ఆర్‌కేఎస్‌వీ కుమార్, ఐఎన్‌టీయూసీ నాయకుడు బి. నాగభూషణం, ఏఐటీయూసీ నాయకుడు ఎస్‌కే రెహ్మాన్, సీఎఫ్‌టీయూఐ నాయకుడు ఎస్. కనకారావు, ఏపీఎఫ్‌టీయూ నాయకుడు దేవా, ఏఐసీసీటీయూ నాయకుడు రామకృష్ణరాజు, వైఎస్సార్ టీయూ నాయకుడు అనిల్‌కుమార్ తదితరులు మాట్లాడారు. మోదీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన నాటి నుంచి కార్పొరేట్లకు అనుకూలంగా వ్యవహరిస్తూ, కార్మిక చట్టాలు కాలరాస్తుందన్నారు. అందులో భాగంగానే బ్రిటిష్ కాలంలో పోరాడి సాధించుకున్న 44 కార్మిక చట్టాల్లో 29 చట్టాలను 4 లేబర్ కోడ్స్‌గా మార్పు చేసిందన్నారు. ఈ కోడ్స్ అమలు జరిగితే కార్మికులు ప్రస్తుతం అనుభవిస్తున్న అనేక హక్కులు కోల్పోతారన్నారు. పని గంటలు విపరీతంగా పెరుగుతాయని, 8 గంటలకు బదులు 15 గంటలు పని చేయాల్సిన పరిస్థితి వస్తుందన్నారు. సంఘం పెట్టుకునే హక్కు, సమ్మె చేసుకునే హక్కు, యాజమాన్యాలతో జీతభత్యాల గురించి మాట్లాడే హక్కు కోల్పోతారన్నారు. ఇప్పటికే విశాఖపట్నం స్టీల్‌ప్లాంట్‌లో కాంట్రాక్టు కార్మికుల తొలగింపులో ఏ విధమైన కార్మిక చట్టాలు అమలు చేయకుండా వారికి ఇష్టం వచ్చినట్టు కార్మికులను తొలగిస్తున్నారని తెలిపారు. ప్రభుత్వరంగ పరిశ్రమలన్నింటినీ కార్పొరేట్ కంపెనీలకు కట్టబెడుతుందన్నారు. ఇప్పటికే రైల్వే, పోర్టులు, విమానాశ్రయాలు, చమురు సంస్థలు, టెలికాం వ్యవస్థ, బ్యాంకింగ్ వ్యవస్థ ఇలా అన్నింటినీ ప్రైవేట్ వాళ్లకి కట్ట బెడుతుందన్నారు. లేబర్ కోడ్స్ అమలు జరిగితే కార్మికులు బానిసలుగా మారతారన్నారు. అందుకే దేశవ్యాప్తంగా మే 20వ తేదీన లేబర్ కోడ్స్ రద్దు చేయాలని అఖిల భారత సమ్మెకు పిలుపునిచ్చాయన్నారు. సమ్మెలో ప్రభుత్వ, ప్రైవేట్ పరిశ్రమలు, సంఘటిత, అసంఘటిత రంగాల్లో పని చేస్తున్న కార్మికులు, స్కీం వర్కర్స్, ట్రాన్స్‌పోర్టు వర్కర్స్, చిరు వ్యాపారులు పాల్గొనాలని పిలుపునిచ్చారు. సమావేశంలో పోర్టు అండ్ డాక్ వర్కర్స్ యూనియన్ నాయకుడు బి. జగన్, శ్రామిక మహిళా సమన్వయ కమిటీ కన్వీనర్ పి. మణి, మోటార్ ట్రాన్స్‌పోర్టు వర్కర్స్ యూనియన్ జిల్లా కార్యదర్శి జి. అప్పలరాజు, విశాఖ జిల్లా ముఠా వర్కర్స్ యూనియన్ ప్రధాన కార్యదర్శి ఎం. సుబ్బారావు తదితరులు పాల్గొన్నారు.

కేజీహెచ్ పిల్లల వార్డుకు వైద్య పరికరాల అందజేత



డాక్టర్ శివానంద్‌కు వైద్య పరికరాలు అందజేస్తున్న ఎక్స్‌ట్రా మైల్ ఫౌండేషన్, బజాజ్ ఎలక్ట్రానిక్స్ ప్రతినిధులు

మహారాణిపేట: కేజీహెచ్ పిల్లల విభాగానికి ఎక్స్‌ట్రా మైల్ ఫౌండేషన్, బజాజ్ ఎలక్ట్రానిక్స్ సంయుక్తంగా సుమారు రూ. 4 లక్షల విలువైన వైద్య పరికరాలు గురువారం సూపరింటెండెంట్ డాక్టర్ శివానంద్ ద్వారా అందజేశాయి. ఈ సందర్భంగా ఎక్స్‌ట్రా మైల్ ఫౌండేషన్ తరఫున ఆంధ్రా మెడికల్ కాలేజీ పూర్వ విద్యార్థి, ప్రముఖ నియోనిటాలజిస్ట్ డాక్టర్ సతీష్ మాట్లాడుతూ ఈ పరికరాలు నవజాత శిశువులకు, వెంటిలేటర్ అవసరమైన శిశువులకు ఎంతో సహాయకారిగా ఉంటాయన్నారు. ఎక్స్‌ట్రా మైల్ ఫౌండేషన్ కార్యదర్శి నటాష కేజీహెచ్ పిల్లల విభాగంపై ప్రత్యేక శ్రద్ధ తీసుకుని ఈ పరికారాలు అందజేశారన్నారు. సూపరింటెండెంట్ డాక్టర్ శివానంద్ మాట్లాడుతూ ఇప్పటి వరకు ఏడాదిలో ఎక్స్‌ట్రా మైల్ ఫౌండేషన్ పిల్లల విభాగానికి రూ. 9 లక్షల విలువైన పరికారాలు అందజేశారని తెలిపారు. ఈ పరికరాలు ఎంతో విలువైనవి అన్నారు. ఈ పరికరాల ద్వారా ఎన్నో శిశు మరణాలు నివారించవచ్చని తెలిపారు. ఈ సందర్భంగా ఎక్స్‌ట్రా మైల్ ఫౌండేషన్ కార్యదర్శి నటాషాకు, డాక్టర్ సత్యవాణికి, బజాజ్ ఎలక్ట్రానిక్స్ ప్రతినిధులకు, డాక్టర్ సతీష్ కుమార్‌కు పిల్లల వార్డు విభాగాధిపతి డాక్టర్ చక్రవర్తి ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. ఈ కార్యక్రమంలో పీడియాట్రిక్ హెచ్‌వోడీ డాక్టర్ బీఎస్ చక్రవర్తి, ప్రొఫెసర్ డాక్టర్ రత్నకుమారి, అసోసియేట్ ప్రొఫెసర్ డాక్టర్ సత్యకుమారి, ఇతర వైద్యులు తదితరులు పాల్గొన్నారు.

పెండింగ్ బిల్లులు చెల్లించాలని వినతి



కలెక్టర్‌కు వినతిపత్రం అందజేస్తున్న రొంగలి జగన్నాథం తదితరులు

మహారాణిపేట: పెండింగ్‌లో ఉన్న కాంట్రాక్టర్ల బిల్లులు తక్షణం చెల్లించాలని జీవీఎంసీ కాంట్రాక్టర్స్ అసోసియేషన్ చైర్మన్ రొంగలి జగన్నాథం కోరారు. గురువారం ఆయన నాయకత్వంలో కాంట్రాక్టర్లు కలెక్టర్ హరేందిర ప్రసాద్‌ను కలిసి వినతిపత్రం సమర్పించారు. జీవీఎంసీలో గత ఏడాది కాలంగా పెండింగ్‌లో ఉన్న సుమారు నాలుగు వందల కోట్ల రూపాయల బిల్లులు, ఈఎండీలు చెల్లించాలని కోరినట్లు తెలిపారు. కాంట్రాక్టర్లు కోట్లాది రూపాయలు అప్పులు చేసి వడ్డీలు కట్టలేక ఆత్మహత్యలు చేసుకునే పరిస్థితి ఉందని జగన్నాథం తెలిపారు. గత మార్చిలో రెవెన్యూ అధికంగా వచ్చినందున కనీసం ఐదారు నెలల బిల్లులు చెల్లించాలని ఆయన కోరారు. దీనిపై కలెక్టర్ సానుకూలంగా స్పందిస్తూ వెంటనే ఈఎండీలు ఆరు కోట్లు రిలీజ్ చేస్తామని హామీ ఇచ్చినట్టు జగన్నాథం వివరించారు. ఆర్థిక పరిస్థితిని పరిశీలించి రెండు మూడు నెలల బిల్లులు చెల్లిస్తామని హామీ ఇచ్చినట్టు తెలిపారు. కలెక్టర్‌ను కలిసిన వారిలో అసోసియేషన్ ప్రతినిధులు గొంప చంద్రమౌళి, రంధి సాధూరావు పీఎస్ ప్రసాద్, గుర్రాల దేవుడు, అంగ రమేష్, టి. గుహేశ్వరరావు, ఎస్‌సీ అప్పారావు తదితరులు ఉన్నారు.

ప్రమాదమని తెలిసినా..





నిత్యం రోడ్డు ప్రమాదాలు సంభవిస్తున్నా ఏ ఒక్కరిలోను మార్పు రావడం లేదు. ఆటోల్లో పరిమితికి మించిప్రయాణికులు ఎక్కుతూనే ఉన్నారు. ఆటో వెనుక కనీస భద్రత లేకుండా కూర్చుని ప్రయాణాలు సాగిస్తున్నారు. అలాగే నిర్మాణాల డెబ్రిస్‌తో ఫుల్ లోడ్‌తో ఉన్న లారీపై మహిళా కార్మికులు ప్రమాదం అంచున ప్రయాణిస్తున్నారు. స్పీడ్ బ్రేకర్లు వచ్చినా, సడెన్ బ్రేక్ వేయాల్సిన పరిస్థితులు ఏర్పడినా వీరు లారీపై నుంచి కింద పడే ప్రమాదం ఉంది.
– సాక్షి ఫొటోగ్రాఫర్, విశాఖపట్నం

మసీదు సెక్రటరీ మృతి



అచ్చియ్యమ్మపేటలో బరక్‌తుల్లా అంత్యక్రియలు

అల్లిపురం: అచ్చియ్యమ్మపేట మస్జీద్ ఫిర్‌దౌసీ కార్యదర్శి, వైఎస్సార్‌సీపీ నాయకుడు షేక్ బరక్‌తుల్లా బుధవారం మృతి చెందారు. అతని అంత్యక్రియలు గురువారం పూర్తి చేశారు. ఈ మేరకు పలువురు మసీదు పెద్దలు, 34వ వార్డు వైఎస్సార్‌సీపీ నాయకులు ఆయనకు నివాళులు అర్పించారు. బరక్‌తుల్లా గతంలో కాంగ్రెస్ పార్టీలో కీలకంగా వ్యవహరించేవారు. తర్వాత వైఎస్సార్‌సీపీ చేరి సేవలందించారు.